క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: గుత్తినదీవిలో నూతన సబ్‌స్టేషన్ 33 కేవీ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం మండలంలోని మురమళ్ల, ఐ.పోలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ మెకా రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందన్నారు.

వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ థామస్

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని డీఎల్‌డీఓ థామస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన ఆడుదాం ఆంధ్ర క్రీడలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కేటగిరికి ఇద్దరు వలంటీర్లకు నియమించామన్నారు. శిక్షణ తీసుకున్న వలంటీర్లు పోటీలు జరిగే ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏడుకొండలు, పీడీలు, పీఈటీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొమరగిరిపట్నం ఉప సర్పంచ్‌గా వెంకటరెడ్డి నాయుడు



వెంకటరెడ్డినాయుడిని అభినందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం ఉప సర్పంచ్‌గా గుర్రం వెంకటరెడ్డినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆలమూరు ఈఓపీఆర్‌డీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు 12వ వార్డు మెంబర్ గుర్రం వెంకటరెడ్డినాయుడుని ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సొసైటీ చైర్మన్ అల్లూరి సురేష్‌రాజు, కాశీవిశ్వేశ్వర స్వామివారి దేవస్థానం చైర్మన్ నామన బాలభాస్కర్ సిద్ధాంతి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు కడలి లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

వైభవంగా కలశపూజ



ఉప్పలగుప్తంలో కలశ పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఉప్పలగుప్తం: మండల కేంద్రమైన ఉప్పలగుప్తంలో గురుస్వామి చిప్పాడ రమేష్ ఆధ్వర్యంలో నాగులపల్లి నారాయణమూర్తి ఇంటి వద్ద గురువారం కలశ పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీలక్ష్మీ గణపతి హోమం, స్వాములకు మహా భిక్షాటన జరిపారు. అనంతరం స్వాములంతా అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు

యానాం: 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మత్స్యకార విద్యార్థులకు రూ.5,000, రూ.7,000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులంతా ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత దరఖాస్తును మత్స్యశాఖ కార్యాలయంలో తమకు అందజేయాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది లేనిచోట రిసోర్స్ ప్లాంట్

యానాం: స్థానిక కనకాలపేట వద్ద ఉన్న డంపింగ్‌యార్డును అక్కడి నుంచి తొలగించి గోపాల్‌నగర్‌లో రికవరీ రిసోర్స్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. అయితే అక్కడ కూడా ప్లాంట్ నిర్మాణం చేపట్టొద్దని, ప్రజలకు ఇబ్బంది లేని చోట నిర్మించాలని తాను ప్రభుత్వానికి అనేక వినతులు అందించానన్నారు. అయితే డంపింగ్ యార్డు మార్పుతో 30 ఏళ్లుగా తాము పడుతున్న ఇబ్బందులు తొలగుతాయని కనకాలపేట, భీమ్‌నగర్, యుకేవీనగర్ ప్రాంతాల నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌తోనే సుస్థిర, సంక్షేమ పాలన

- మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి
- ఊరూరా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



అమలాపురం వార్డు సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర, సంక్షేమ పాలన సాకారమవుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక మహిపాలవీధిలోని అయిదో వార్డు సచివాలయం ఆవరణలో గురువారం జరిగిన ×ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే¥ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన ఈ సభలో తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధి సమాచారాన్ని ఆయా కుటుంబాలకు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ పార్టీ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పట్టణ యువజన కమిటీ పార్టీ అధ్యక్షుడు దూడల ఫణి, పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్, ఇలకోటి రాంబాబు, చింతా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక పంచాయతీ పరిధిలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం సర్పంచ్ బర్రే సీతారత్నం అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాల బోర్డుని ఆయన ప్రారంభించారు. అనంతరం మార్కెట్ సెంటర్లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఉప సర్పంచ్ కుప్పాల దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ రాజేశ్వరి, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, మాజీ ఎంపీటీసీ రేవు సుందరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ రావాలి

ఐ.పోలవరం: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని పలువురు పేర్కొన్నారు. ఐ.పోలవరం సచివాలయం-1 పెదమడిలో గురువారం 'ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం సర్పంచ్ దంతులూరి రాఘవరాజు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘవరాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ నారాయణ, సొసైటీ అధ్యక్షులు విత్తనాల శ్రీనివాసరావు, రేవు యజ్ఞశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నేరుగా సంక్షేమం

అమలాపురం రూరల్: నాలుగున్నరేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి లబ్ధిదారులకు నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం ఈదరపల్లి సచివాలయం-1లో సర్పంచ్ రాయుడు వరలక్ష్మి అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.మల్లిఖార్జునరావు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అడపా బాబులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఊటాల ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్, దంగేటి రుద్ర తదితరులు పాల్గొన్నారు.



పెదమడిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు



ఈదరపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ డోలామణి తదితరులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు బాపూజీ

పీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించాలి



సమస్యలపై చర్చిస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: మండలంలోని గాడిమొగ పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి వైద్యురాలు జయభార్గవి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయభార్గవి మాట్లాడుతూ ఆస్పత్రిలో నీటి సమస్య ఉందని, అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇబ్బందిగా ఉందని ప్రస్తావించారు. దీనిపై ఎంపీపీ సునీత స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, రాయుడు గంగాధర్, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రేషన్ బియ్యం

అమలాపురం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలకు రేషన్ బియ్యం అందిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకట రామ్మోహన్‌రావు(దొరబాబు), యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్‌లు అన్నారు. గురువారం బీజేపీ స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తున్న 9260 రేషన్ వాహనాలకు అందించిన రాయితీలో 60 శాతం కేంద్రం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, దూరి రాజేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా నిలిచిన ప్రభుత్వమిది



భైరవపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఎమ్మెల్యే పొన్నాడను వెండి కిరీటంతో సత్కరిస్తున్న గ్రామపెద్దలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- భైరవపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రభుత్వం మత్స్యకారులకు అడుగడుగునా అండగా నిలబడిందని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాల్లో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ మత్యకారులకు అండగా నిలిచి ఓఎన్‌జీసీ నుంచి రావాల్సిన సొమ్మును ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా ఒక్క బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. గడప గడపకూ సంక్షేమ ఫలాలు చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం సచివాలయం వద్ద రూ.84 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల 'మా నమ్మకం నువ్వే జగనన్న' పోస్టరును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మత్యకారులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ ఓఎన్‌జీసీ నష్ట పరిహారానికి సంబంధించి ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికీ రూ.69 వేల చొప్పున ఈ నెల 21న బ్యాంకు ఖాతాలో జమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పెమ్మాడి బాబూరావు, ఢిల్లీ నారాయణ, పెమ్మాడి భవాని, కాలాడి నూకరత్నం, లంకే రాముడు, పాలెపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదను కోల్పోతున్నందుకే నష్ట పరిహారం

తాళ్లరేవు: పరిశ్రమల ఏర్పాటు కారణంగా మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అందుకే ఆయా పరిశ్రమలు నష్ట పరిహారం అందజేస్తున్నాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం చినబొడ్డు వెంకటాయపాలెంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ పాల్గొని మాట్లాడారు. ఓఎన్‌జీసీ అందజేస్తున్న నష్ట పరిహారాన్ని ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేయనున్నారని చెప్పారు. ఈ నెల 21వ తేదీన కోరంగిలో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడకు వెండి కిరీటాన్ని బహూకరించి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు



గ్రంథాలయ వారోత్సవాల సభలో మాట్లాడుతున్న కవి డాక్టర్ కొల్లూరి



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నరసింహమూర్తి

అమలాపురం టౌన్: గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత, కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మూడో రోజు గురువారం జరిగిన సభకు డాక్టర్ కొల్లూరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతున్న క్రమంలో చైతన్యాన్ని నింపే ఇలాంటి వారోత్సవాలు చేయడం అభినందనీయమని డాక్టర్ కొల్లూరి అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు అభినందనీయం

ఉప్పలగుప్తం: గ్రంథాయల ఉద్యమానికి ఊపిరి పోసే మహనీయుల సేవలు అభినందనీయమని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, మేడిచర్ల, హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సత్యకృష్ణ, గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషకుమార్, సలాది పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సమనస శ్రీరామ్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథ్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆటో కన్సల్టెంట్స్ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ ప్రతినిధులతో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పట్టణంలో నూతనంగా ఏర్పాటైన మైత్రి ఆటో కన్సల్టెంట్స్ అండ్ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ది చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జనిపిరెడ్డి శ్రీహరి ప్రసాద్, కార్యదర్శి మహిపాల ఫణి, కోశాధికారి గోపి, ఉపాధ్యక్షుడు గాదిరాజు గంగరాజు, సంయుక్త కార్యదర్శి సాధనాల మురళి తదితరులతో ప్రమాణం స్వీకారం చేయించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కోశాధికారి కరెళ్ల రమేష్‌బాబు, పొట్టి శ్రీరాములు, జనిపిరెడ్డి సురేష్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

'ఆడుదాం ఆంధ్ర' శిక్షణా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: డిసెంబర్ 16 నుంచి జనవరి 26 వరకూ జరిగే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో భాగంగా సచివాలయ సిబ్బందికి, వార్డు వలంటీర్లకు ముమ్మిడివరం నగర పంచాయితీ కార్యాలయ కౌన్సిల్ హాలులో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ హాజరై ప్రసంగించారు. నగర పంచాయతీ పరిధిలోని ఏడు సచివాలయాల్లో క్రికెట్, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం రాయుడువారిపాలెం సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిపెళ్ల శ్రీరామకృష్ణంరాజు, రామాయణం రాంబాబు, దేవరపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బాలాజీ కల్యాణం



కల్యాణ వేదికపై కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామి

మామిడికుదురు: నిత్య కల్యాణం పచ్చతోరణంగా భక్తుల పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవం గురువారం ఈదరాడలో కన్నుల పండువలా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శివాలయం ప్రాంగణంలో స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. శ్రీదేవి, భూదేవిని బాలబాలాజీ స్వామి పరిణయమాడారు. వేద పండితుడు జ్యోత్స్నుల సోమయాజులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. భక్తులు గోవింద నామ స్మరణలతో కల్యాణోత్సవాన్ని వీక్షించి, అక్షతలు, అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన కల్యాణోత్సవంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, బత్తుల గంగారత్నం, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

యానాం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ద్వారా అమలు జరుగుతున్న ఎన్‌యూఎల్ఎం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న కొరియర్ డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా 60 మంది కొరియర్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఆర్ఏఓ మునిస్వామి సంబంధిత కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, ఏసీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత నేత్రవైద్య శిబిరం

యానాం: ఈ నెల 25న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కార్యాలయం వద్ద ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పులవర్తి శ్రీను, దంగుడు బియ్యం వీవీ సత్యనారాయణ, సతీష్‌చంద్ర గురువారం తెలిపారు. 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు.

ఓం సదాశివ నిలయం ప్రారంభం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం జంక్షన్ సమీపంలో సలాది రామానాయుడు నిర్మించిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఓం సదాశివ నిలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ ఆలయంలో భక్తులే స్వయంగా అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సలాది సత్తిబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, చిక్కాల నరసింహమూర్తి, విల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం



డీఎం చల్లా సత్య నారాయణమూర్తి

అమలాపురం రూరల్: ఆర్టీసీ ప్రయాణికుల కోసం గిఫ్ట్ స్కీం ప్రారంభిస్తునట్లు డీఎం చల్లా సత్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి రాజమహేంద్రవరం, ఓడలరేవు రూట్‌లో నడుపుతున్న అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించేవారికి ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ గిఫ్ట్ స్కీంలో భాగంగా ప్రయాణికులు తమ టికెట్ వెనుక వారి వివరాలు రాసి బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా ద్వారా విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు.

100 కేజీల ఇత్తడి సామాన్లు చోరీ

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంట్లోకి చొరబడి సుమారు 100 కేజీల ఇత్తడి సామాన్లు చోరీ చేశారని నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం కాకినాడలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే లోపు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలంలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలపై సర్వత్రా ఆందోళన నెలకొంది. నాలుగు నెలల క్రితం పెదగాడవిల్లిల్లో ఓ ఇంట్లోకి చొరబడి బంగారు నగలను దోచుకెళ్లారు. ఇదే గ్రామంలోని సాయిబాబా ఆలయం, చినగాడవిల్లి, చల్లపల్లి గ్రామాల్లోని పలు ఆలయాల్లో చోరీలు జరిగాయి. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అల్లవరం: మండలంలోని దేవగుప్తం పంచాయతీ పరిధిలోని హైస్కూల్ రోడ్‌లోని పోచ్చినపెద్ది సత్యనారాయణ ఇంటిలో 46 కేజీల ఇత్తడి సామాన్లు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జంగా సత్యనారాయణ గురువారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇత్తడి సామాన్లు ఎత్తుకెళ్లారన్నారు. గురువారం ఉదయం చోరీని గుర్తించి ఫిర్యాదుచేశారని చెప్పారు. ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులది కీలకపాత్ర



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ప్రజలు ఆర్థికాభివృద్ధిని సాధించడంలో బ్యాంకులు కీలపాత్ర పోషిస్తాయని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిక్రియనగర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకులు సామాజికపరమైన బాధ్యతను మర్చిపోకుండా పేదలకు, వ్యాపారులకు విరివిగా ఋణాలివ్వాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వీవీఎస్ రామ్‌మోహన్, విజయవాడ జోన్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, వేగేశ్న భాస్కరరాజు, మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, మల్లాడి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



గ్రామ పంచాయతీలకు మొక్కలను అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణ, సమతుల్యతకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బయో డైవర్సిటీ శాఖ సమకూర్చిన 4800 మొక్కలను గ్రామ పంచాయతీలకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ, రాయుడు గంగాధర్, పెంకే అర్జున్, కూరాటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.